# 1 రాజులు 19వ అధ్యాయము

1 ఏలీయా చేసినదంతయును అతడు ఖడ్గముచేత ప్రవక్తలనందరిని చంపించిన సంగతియును అహాబు
యెజెబెలునకు తెలియజెప్పగా

2 యెజెబెలు ఒక దూతచేత ఏలీయాకు ఈ వర్తమానము పంపించెను – రేపు ఈ వేళకు నేను నీ
ప్రాణమును వారిలో ఒకని ప్రాణమువలె చేయనియెడల దేవుడు నాకు గొప్ప అపాయము కలుగజేయునుగాక.

3 కాబట్టి అతడు ఈ సమాచారము తెలిసికొని, లేచి తన ప్రాణము కాపాడుకొనుటకై పోయి, యూదా
సంబంధమైన బెయేర్షెబాకు చేరి, అచ్చట ఉండుమని తన దాసునితో చెప్పి

4 తాను ఒక దినప్రయాణము అరణ్యములోనికి పోయి యొక బదరీవృక్షముక్రింద కూర్చుండి,
మరణాపేక్షగలవాడై – యెహోవా, నా పితరులకంటె నేను ఎక్కువవాడను కాను, ఇంతమట్టుకు చాలును, నా
ప్రాణము తీసికొనుము అని ప్రార్థనచేసెను.

5 అతడు బదరీవృక్షము క్రింద పరుండి నిద్రించుచుండగా ఒక దేవదూత వచ్చి అతని ముట్టి – నీవు ఏలచి
భోజనము చేయుమని చెప్పెను.

6 అతడు చూచినంతలో అతని తలదగ్గర నిప్పుల మీద కాల్చబడిన అప్పమును నీళ్లబుడియు కనబడెను
గనుక అతడు భోజనము చేసి తిరిగి పరుండెను.

7 అయితే యెహోవా దూత రెండవమారు వచ్చి అతని ముట్టి – నీ శక్తికి మించిన ప్రయాణము నీకు
సిద్ధమైయున్నది, నీవు లేచి భోజనము చేయుమని చెప్పినప్పుడు

8 అతడు లేచి భోజనముచేసి, ఆ భోజనపు బలముచేత నలువది రాత్రింబగళ్లు ప్రయాణముచేసి, దేవుని
పర్వతమని పేరు పెట్టబడిన హోరేబునకు వచ్చి

9 అచ్చట ఉన్న యొక గుహలోచేరి బసచేసెను. యెహోవా వాక్కు అతనికి ప్రత్యక్షమై ఏలీయా, యిచ్చట
నీవేమి చేయుచున్నావని అతని నడుగగా

10 అతడు– ఇశ్రాయేలు వారు నీ నిబంధను త్రోసివేసి నీ బలిపీఠములను పడగొట్టి నీ ప్రవక్తలను
ఖడ్గముచేత హతము చేసిరి, సైన్యముల కధిపతియు దేవుడునగు యెహోవా కొరకు మహారోషముగలవాడనై నేను
ఒకడునుమాత్రమే మిగిలియుండగా వారు నాప్రాణమును కూడ తీసివేయుటకై చూచుచున్నారని మనవి చేసెను.

11 అందుకాయన – నీవు పోయి పర్వతముమీద యెహోవా సముఖమందు నిలిచియుండుమని సెలవిచ్చెను.
అంతట యెహోవా ఆ వైపున సంచరింపగా బలమైన పెనుగాలి లేచెను, యెహోవా భయమునకు పర్వతములు
బద్దలాయెను; శిలలు ఛిన్నాభిన్నములాయెనుగాని యెహోవా ఆ గాలిదెబ్బయందు ప్రత్యక్షము కాలేదు. గాలిపోయిన
తరువాత భూకంపము కలిగెను గాని ఆ భూకంపమునందు యెహోవా ప్రత్యక్షము కాలేదు.

12 ఆ భూకంపమైన తరువాత మెరుపు పుట్టెను గాని ఆ మెరుపునందు యెహోవా ప్రత్యక్షము కాలేదు,
మెరుపు ఆగిపోగా మిక్కిలి నిమ్మళముగా మాటలాడు ఒక స్వరము వినబడెను.

13 ఏలీయా దాని విని తన దుప్పటితో ముఖము కప్పుకొని బయలుదేరి గుహవాకిట నిలిచెను. అంతలో – ఏలీయా, ఇచ్చట నీవేమి చేయుచున్నావని యొకడు పలికిన మాట అతనికి వినబడెను.

14 అందుకతడు – ఇశ్రాయేలువారు నీ నిబంధనను త్రోసివేసి నీ బలిపీఠములను పడగొట్టి నీ ప్రవక్తలను ఖడ్గముచేత హతముచేసిరి. సైన్యములకధిపతియు దేవుడునగు యెహోవా కొరకు మహా రోషముగలవాడనై నేను ఒకడను మాత్రమే మిగిలియుండగా వారు నాప్రాణము తీసివేయుటకై చూచుచున్నారని చెప్పెను.

15 అప్పుడు యెహోవా అతనికి సెలవిచ్చినదేమనగా – నీవు మరలి అరణ్యమార్గమున దమస్కునకు పోయి దానిలో ప్రవేశించి సిరియ దేశముమీద హజాయేలునకు పట్టాభిషేకము చేయుము;

16 ఇశ్రాయేలు వారిమీద నింషీకుమారుడైన యెహూకు పట్టాభిషేకము చేయుము; నీకు మారుగా ప్రవక్తయైయుండుటకు ఆబేల్మెహోలావాడైన షాపాతు కుమారుడైన ఎలీషాకు అభిషేకము చేయుము.

17 హజాయేలు యొక్క ఖడ్గమును తప్పించుకొనువారిని యెహూ హతము చేయును; యెహూ యొక్క ఖడ్గమును తప్పించుకొనువారిని ఎలీషా మతము చేయును.

18 అయినను ఇశ్రాయేలు వారిలో బయలునకు మోకాళ్లూనకయు, నోటితో వాని ముద్దుపెట్టుకొనకయు నుండు ఏడు వేలమంది నాకు ఇంకను మిగిలియుందురు.

19 ఏలీయా అచ్చట నుండి పోయిన తరువాత అతనికి షాపాతు కుమారుడైన ఎలీషా కనబడెను. అతడు తన ముందరనున్న పన్నెండు అరకల యెడ్లచేత దుక్కి దున్నించుచు పన్నెండవ అరక తాను తోలుచుండెను. ఏలీయా అతని చేరబోయి తన దుప్పటి అతనిమీద వేయగా

20 అతడు ఎడ్లను విడిచి ఏలీయావెంట పరుగెత్తి – నేను పోయి నా తలిదండ్రులను ముద్దుపెట్టుకొని తిరిగివచ్చి నిన్ను వెంబడించెదనని చెప్పి అతనిని సెలవడుగగా అతడు – పోయి రమ్ము, నా వలన నీకు నిర్బంధము లేదని చెప్పెను.

21 అందుకతడు అతనిని విడిచి వెళ్లి కాడియెడ్లను తీసి, వధించి వాటి మాంసమును గొర్తినొగల చేత వంటచేసి జనులకు వడ్డించెను. వారు భోజనము చేసిన తరువాత అతడు లేచి ఏలీయా వెంబడి వెళ్లి అతనికి ఉపచారము చేయుచుండెను.